# 5

# ఆహారయాత్ర

భూమికీ ఆకాశానికీ మధ్య చినుకుల సంబంధం తెగిపోయిన రెండోరోజది...

వారంరోజులుగా గైరాజరైన సూర్యుడావేళ మబ్బుల్లోంచి బయటపడేందుకు తెగ గింజుకుంటున్నాడు. పరిసరాలింకా తడి తడిగానే వున్నాయి. రోడ్డుమీదా రోడ్డు పక్కనా బురదగుంటలు ఎంతకీ మానిపోని పుండ్లలా వున్నాయి.

ఇరానీ హోటల్ ఎంట్రెన్స్ చివరిమెట్టుకి ఎడంవైపు మూలన చిన్న కన్నంలోంచి చటుక్కున బయలుపడిందో చీమ. రెండు క్షణాలు జాగ్రత్తగా పరిసరాలు గమనించి మెల్లగా ముందుక్కదిలింది. అదట్లా నాలుగంగుళాలు వెళ్లిందో లేదో... కన్నంలోంచి బయటకొచ్చిన మరోచీమ దూకుడుగా వొచ్చి మొదటి చీమను కల్సుకుంది.

ప్రశాంతంగా వున్న ఆ వాతావరణంలో చీమలు రెండూ గోడపక్కగా చిక్కుముళ్లు పడ్డ దారాల్లా కదుల్తున్నాయి. కింద నేలంతా వర్షానికి తడిసి రొచ్చురొచ్చుగా వుంది. ఎత్తుపల్లాల్ని... చిన్న చిన్న నీటి మడుగుల్ని జాగ్రత్తగా గమనిస్తూ కాటుక గీతల్లాంటి కాళ్ళతో ఒక్కో అంగుళమే దాటేసి ముందుకు పోతున్నాయి.





Scanned by CamScanner

వాటిల్లో మరీ చిన్నగావున్న చీమ మాటిమాటికీ వేగంగా కదుల్తూ ముందుకెళ్లి పోతోంది. అలా నడుస్తుంటే దానికెంతో ఉత్సాహంగా వుంది.

వెనకాలే అతిజాగ్రత్తగా పరిసరాలు గమనిస్తూ వొస్తున్న మొదటి చీమ నీలి, దాని దూకుడు నడక్కి కంగారుపడుతోంది.

'ఒసే చిట్టీ... కొంచెం నెమ్మదిగా... చుట్టూ చూసుకుంటూ నడువ్. నీ దూకుడుకు దేనికిందనో పడి చస్తావ్' అంటూ హెచ్చరిస్తోంది.

అక్క మాటల్ని ఎంతమాత్రం ఖాతరు చేయట్లేదు చిట్టి చీమ. గంతులేసినట్లు నడుస్తూ ముందుకెళ్తోంది. మధ్య మధ్య అదేవేగంతో వెనక్కి పరిగెత్తుకొచ్చి అక్క చుట్టూ ఓ రౌండ్ కొట్టేసి, మళ్లా రయ్యిన ముందుకు దూసుకుపోతోంది.

'చెప్తుంటే విన్పించుకోవేమిటే ముండా...! అలా పరిగెత్తి నడమంత్రపు చావు తెచ్చుకుంటావేమిటి...?'

అరిచి అరిచి నీలి చీమకి నోరుపోతోంది. కానీ చిట్టి ఉరుకులు మాత్రం మానలేదు. చిట్టి చీమను వెంటబెట్టుకొని బయటకు రావడం నీలి కెంతమాత్రం ఇష్టం లేదు. ఇంటి దగ్గర తల్లికూడా వొద్దంది. కానీ చిట్టి విన్పించుకోలేదు.

వారం రోజులుగా కురిసిన వర్షాలకు చీమల నివాసం యావత్తూ వరదమయమై పోయింది. తమ కొంపల్నీ... కొంపల్లో సమకూర్చుకున్న కొద్దీ గొప్పా ఆహారాన్నీ వొదిలేసి చీమలన్నీ తలోదిక్కుగా చెల్లాచెదురయ్యాయ్. ఆ గందరగోళంలో విడిపోయిన నీలిచీమ తండ్రి మళ్లా కన్పించలేదు. నీళ్లింకిన తర్వాత కొంపకు చేరుకుంటే పోగుచేసుకున్నదేమీ మిగల్లేదు. తల్లీ కూతుళ్ళూ తండ్రి చీమ కోసం ఎంతగానో ఎదుర్చూశాయి. కానీ అది తిరిగి రాలేదు. తండ్రిచీమ వరదలో కొట్టుకుపోయిందని కొందరంటే ఏదో ప్రమాదంలో నలిగి చచ్చిపోయిందని మరికొందరన్నారు. కాదు... రాణి చీమ స్థావరంలోకి ఆహారం చేరేస్తుంటే ఏదో గొడవొచ్చి సైనికచీమలు దాన్ని చంపేశాయనే పుకారు కూడా విన్పించింది.

ఈ ఊహాగానాల మాటెలా వున్నా నీలి చీమకి మాత్రం తండ్రి ఇక తిరిగిరాడని అర్థమైంది.

అలా నాలుగురోజులు గడిచాయి...

అయిదోరోజు మరి తట్టుకోలేక తినడానికేమైనా తెస్తానని బయటపడింది నీలి చీమ. తండ్రి జ్ఞాపకాలు మనసును కలిచివేస్తుంటే పరధ్యానంగా నడుస్తోంది. కళ్ళలోంచి జారుతున్న అశ్రువులను వొత్తుకోవాలన్న ధ్యాస కూడా లేదు.



Scanned by CamScanner

'ఎందుకక్కా ఏడుస్తున్నావ్...? నాన్న గుర్తొచ్చాడా?' అన్న చిట్టి పలకరింపుతో ఉలిక్కిపడి ఈలోకంలోకి వొచ్చింది. తన కన్నీళ్లు తుడుస్తున్న చెల్లెలి లేత చేతుల్ని ప్రేమగా ముద్దు పెట్టుకుంది.

'నాన్న ఎక్కడికెళ్ళాడక్కా..?' అడిగింది చిట్టి అక్క పక్కనే నడుస్తూ.

'తెలియదమ్మా! వరదొచ్చి మన కొంపలు కొట్టుకుపోయిన్నాడు పోయాడు. ఇంతవరకూ రాలేదు. ఎక్కడున్నాడో... ఏమిటో'

'నాన్న నెవరో చంపేసారటకదా...? నిజంగానే నాన్న చచ్చిపోయాడా అక్కా...'

ఈ ప్రశ్నకు నీలిచీమ వెంటనే జవాబు చెప్పలేకపోయింది. 'నాన్న చచ్చిపోలేదమ్మా... త్వరలో తిరిగొస్తాడు' అంది.

'సైనిక చీమలంటే ఎవరక్కా...?' మళ్లీ అడిగింది చిట్టి.

'వాటిని రక్షకభటులంటారమ్మా. ఇంకా సిపాయి చీమలని కూడా అంటారు. అవి రాణివాసంలో వుంటాయి...'

'రాణివాసమంటే...'

'రాణిచీమ స్థావరం'

'అదెక్కడుంది...! మనం ఒకసారి వెళదాం అక్కా' కుతూహలంగా అంది చిట్టిచీమ.

'మనల్ని అక్కడికి రానివ్వరమ్మా. పనిచేసే పెద్దచీమలకి మాత్రమే అందులో ప్రవేశం'

'ఏం పని చేయాలక్కడ...?'

'ఒక్కటేమిటి...? ఇళ్లుతుడవటం, రోడ్లూడవటం దగ్గర్నుంచి రాణీవాసంలో ప్రతిపనీ చెయ్యాలి. అన్నిటికన్నా ముఖ్యంగా సాయంత్రానికల్లా ఎంతోకొంత ఆహారాన్ని సంపాదించి అక్కడ అందజెయ్యాలి.

'మరి వాళ్ళకేం రోగమక్కా...? వాళ్ల కూడు వాళ్లు సంపాదించుకోలేరా...?' వాళ్ళకు మనమెందుకు తెచ్చిపెట్టాలి?

'ఉష్.. గయ్యాళిముండా...! కాస్త మెల్లగా మాట్లాడు. సిపాయి చీమేదైనా విన్నదంటే మనల్ని బతకనివ్వదు. రాణీవాసమంటే ఏమిటనుకున్నావ్..? అది సర్కారు. అక్కడుండే వాళ్లంతా సర్కారోళ్ళన్నమాట. వాళ్లు పనులు చెయ్యరు. చెయ్యకూడదు. మన నివాసంలో వుండేవన్నీ బానిస చీమలన్నమాట. శ్రామిక చీమలని మనక్కొంచెం పరువుగల



Scanned by CamScanner

పేరుకూడా ఉన్నదనుకో. ఈ శ్రామిక చీమలన్నీ రాణీవాసంలో వుండే సర్కారు చీమలకి ఆహారం తెచ్చిపెట్టాలి. వాళ్లు దయదల్చి ఏదన్నా ఇస్తే అది మనం తినాలి'.

'కాలే కడుపులతో మనం చెట్టూ పుట్టా తిరుగుతూ ఆహారాన్ని సంపాదించి వాళ్లకివ్వాలా...? వాళ్లు దయదల్చి మిగిల్చిన కూడు మనం తినాలా...? ఛూ... మనయేం బతుకులక్కా?' చీదరించుకుంది చిట్టిచీమ. అక్కను మరింకేమి ప్రశ్నించకుండా విసురుగా ముందుకు నడిచింది.

నీలిచీమ చూపులు హఠాత్తుగా రెండడుగుల దూరంలో వున్న తెల్లటి ఆకారం మీద పడ్డాయి. చిట్టిని హెచ్చరిస్తూ నడకలో వేగాన్ని తగ్గించింది.

చాలా పెద్ద ఆకారమది. నీలిచీమ కళ్లు పైకెత్తిచూస్తే తప్ప అసాంతం కనపడలేదు. చిట్టికూడా దాన్ని గమనించి భయంతో అక్క వెనకాల నక్కింది.

నడక పూర్తిగా ఆపి చుట్టూ పరిశీలనగా చూసింది నీలి. కనుచూపు మేరలో ఏ ప్రమాదమూ లేదు.

ఉన్నట్టుండి ఓ గాలితెర పెద్దగా వీచింది. పైనగోడమీద కిటికీలోంచి ఎవరో చెత్త బయటకు విసిరేసారు. భయంతో ఉన్నచోటునే కరుచుకొని వుండిపోయింది నీలిచీమ.

నిమిషం తరువాత కళ్లు విప్పేసరికి ఇందాక కనిపించిన తెల్లటి ఆకారం తనకు పూర్తిగా దగ్గరకొచ్చేసింది. దాన్ని చూసి చిట్టి చీమ భయంతో అరిచి అక్కణ్నుంచి వేగంగా పారిపోయింది.

నీలి గుండెలు జల్లుమన్నాయి. ఎదురుగా కొండలాంటి ఆకారమేమిటో అర్థం కాలేదు. రెండు నిముషాలు గడిచినా అది కదలకుండా వున్నచోటునే వుండటంతో ధైర్యాన్ని కూడగట్టుకొని ఆ ఆకారానికి మరింత దగ్గరగా నడిచింది. దానిచుట్టూ రెండు రౌండ్లు తిరిగింది. ఏదో పరిచయమైన వాసన దాని నాసికాపుటాలకు సోకింది. ఊపిరి గట్టిగా పీల్చి ఆ వాసనేమిటో పసిగట్టిన నీలి ఆనందంతో ఎగిరి గంతేసింది.

అదో రొట్టెముక్క... కొండంత ఆహారం...!

నీలిచీమ ఇంకా దగ్గరగా వెళ్లి చేతుల్తో తడిమి చూసింది. అవునది రొట్టెనే. మెత్తగా కూడా వుంది.

నీలికి పట్టరాని సంతోషం కల్గింది. వాళ్ల స్థావరంలోని శ్రామిక చీమలన్నింటికీ కనీసం రెండురోజులకు సరిపోయే ఆహారమది. అంత ఆహారాన్ని ఒకేచోట



Scanned by CamScanner

కనుగొన్నందుకు ఎంతో గర్వపడింది నీలి. ఆ సంతోషంలో చెల్లెలు గుర్తొచ్చి చుట్టూ చూసింది. చిట్టి కన్పించలేదు.

ఆ ప్రాంతమంతా కలియదిరిగింది. చెల్లెలు జాడ లేదెక్కడా. నీలిచీమకి కంగారు పుట్టింది. ఓ పక్క పెద్దఎత్తున ఆహారం దొరికినందుకు సంతోషపడాలో, చెల్లెలు గురించి ఆందోళనపడాలో చప్పున తెలియలేదు.

ఆ ప్రదేశంలో ఇక ఒంటరిగా వుండటానికి భయమేసి తమ స్థావరం కేసి పరుగందుకుంది.

* * *

ఆ స్థావరంలో నివాసముండేవన్నీ శ్రామిక చీమలే. అందరి సమస్యలూ దాదాపు ఒక్కటే కావటం, పొద్దుగూకులూ ఒకే అధికారం కింద చాకిరీ చెయ్యటం, ఆకలి జబ్బు అక్కడ అందరికీ సర్వ సాధారణం కావడం... ఇవన్నీ ఆ చీమల్ని కల్సికట్టుగా వుండేలా చేశాయి.

నీలి ఉరుకులు పరుగులతో స్థావరాన్ని చేరుకునేసరికి తమ ఇంటి ముందు పెద్ద గుంపు పోగై వుండటం కన్పించింది. అంతమంది తమ ఇంటిముందు ఎందుకున్నారో అర్థంగాక ఆశ్చర్యంతో పాటు భయం కూడా కలిగింది. 'చిట్టికేం కాలేదుకదా...?' ఈ యోచన రాగానే కంగారుగా ముందుకొచ్చింది నీలి.

అల్లంత దూరాన్నే నీలిని చూశాయి చీమలన్నీ. ఎదురొచ్చి ఆమెను చుట్టుకున్నాయి. 'నీ కడుపు చల్లగుండ...! నీకేం కాలేదు కదా బిడ్డా...! అందరం ఎంత భయపడ్డమో...!' నీలిని కావలించుకుంటూ అంది తల్లిచీమ.

'భయమెందుకే అమ్మా...'

'అదేమిటే... అలా అడుగుతావ్...? ఏదో భూతం నీమీద దాడి చేసిందని చెప్పింది చిట్టి. ఆ భూతాన్ని చూసి భయపడి నీ చెల్లెలు ఇంటికి పరిగెత్తుకొచ్చింది. దాని మాటలు విన్నాక మాకు కాళ్ళూ చేతులు ఆడలేదు. ఇక మీ అమ్మనైతే ఒకటే ఏడుపు..'

గుంపులో వయసుడిగిన ఓ చీమ అంది.

విని బిగ్గరగా నవ్వింది నీలి. అందరూ తనవంక చిత్రంగా చూడటంతో నవ్వునాపి అక్కడ జరిగింది వివరించింది.

'నువ్వు చెప్పింది నిజమటే...? నువు చూసింది నిజంగా రొట్టేనా...?' అనుమానంగా అడిగిందో చీమ.



Scanned by CamScanner

'అమ్మతోడు తాతా...! నిజంగానే అది కొండంత రొట్టె. మన వాడకంతటికీ రెండు రోజుల దాకా తిండికి దిగులక్కర్లేదు. నా మాట విని అంతా అక్కడికి త్వరగా పదండి. పెద్దజాతి చీమలో... సిపాయి చీమలో చూశాయంటే మన నోట్లో దుమ్ము పడ్తుంది...' నీలిచీమ అందర్నీ తొందరపెట్టింది.

చీమలన్నీ హర్షధ్వానాలు చేశాయి. కొన్ని చీమలైతే నీలిని ప్రేమగా ముద్దుపెట్టుకున్నాయి.

క్షణాలమీద ఈ వార్త వాడంతా పాకిపోయింది. చిన్నాపెద్దా చీమలన్నీ కట్టగట్టుకొని ముందుక్కదిలాయి. నీలి ముందు దారి చూపుతుంటే చీమలు చాలావేగంగా నడిచి ఇరానీ హొటల్ వెనుక చెత్తకుప్ప దగ్గరకు చేరుకున్నాయి. నీలిచీమ చూసిన ఆహారం ఇంకా అక్కడే వుంది. శ్రామిక చీమలన్నీ అభినందిస్తున్నట్లుగా చూశాయి నీలివంక. ఆ ఆహారపు కొండను తరలించడానికి క్షణాల మీద వ్యూహం తయారైంది. రొట్టె చుట్టూ చేరి చీమలన్నీ దాన్ని కరిచిపట్టుకున్నాయి. మరోక్షణంలో వాటి మహాప్రస్థానం మొదలయ్యేదే.

ఇంతలో

'ఆగండి...! ఎవ్వరూ కదలడానికి వీల్లేదు. ఆ ఆహారం మాది' అన్న పిడుగు లాంటి స్వరం విన్పించింది.

శ్రామిక చీమలు ఉలికిపడి అటు చూశాయి. పెద్ద గండుచీమల దండు దూకుడుగా ముందుకొచ్చింది. చూస్తుండగానే అవి రొట్టెచుట్టూ వలయాకారంగా నిలబడ్డాయి. వాటి వాలకం చూస్తుంటే యుద్ధానికి సిద్ధం అన్నట్లుగా వున్నాయి.

'ఈ ఆహారం మాది. అడ్డు తొలగండి.' అన్నాడు గండుచీమల దండు నాయకుడు బిగ్గరగా.

ఆ గద్దింపుతో రొట్టెను పట్టుకున్న చీమలన్నీ దాన్నొదిలేసి నిలబడిపోయాయి. అందరికన్నా ముందుగా నీలిచీమ తేరుకుంది. 'ఈ ఆహారాన్ని ముందుగా చూసింది నేను. ఇది చూడగానే మా వాడకెళ్లి మావాళ్లను పిల్చుకొచ్చాను. అందుకని ఈ ఆహారం మాదే' అంది.

'ఏంటిదే పోరీ...! బాగా మాట్లాడుతున్నావ్...? నువ్వు చెప్పే కట్టుకథలు ఇక్కడెవరు నమ్మరు. నీకన్నా ముందే ఈ రొట్టెను మేము చూశాం. మర్యాదగా పక్కకు జరుగుతారా.. లేదా..?' అంది గుడ్లురుముతూ.



Scanned by CamScanner

'కాదు... ముందు నేనే చూశాను. దీన్ని నేను చూసినప్పుడు ఇక్కడ ఎవ్వరూ లేరు. ఇది మాదే. మా తిండి లాక్కోవడం అన్యాయం.'

'అవును అన్యాయం...' అన్నాయి మిగతా చీమలు నీలికి జతగా.

'నోరు ముయ్యండి...! మీరా మాకు న్యాయం చెప్పేది...?' గట్టిగా అరిచింది గండుచీమ. 'ఈ ఆహారం మాది. మేం ఏది చెప్పితే అదే న్యాయం. బలమున్నోడు ఎక్కడుంటే అక్కడుంటుంది న్యాయం. మీ దిక్కున్నచోట చెప్పుకోండి... నడవండిక్కణ్నుంచి'

నీలిచీమకేం చెయ్యాలో తోచలేదు. తనవాళ్లకేసి తలతిప్పింది. అంతా దీనంగా చూస్తున్నారు. చివరి ప్రయత్నంగా రెండడుగులు ముందుకేసి గండుచీమల దండు నాయకున్ని ప్రాథేయపడింది.

'అయ్యా... ఈ ఆహారం నిజంగా మాదే. మేమే ముందుచూశాం. దయచేసి ఒక్కసారి మావాళ్ల కడుపులు చూడండి ఎట్లా లోతుకుపోయాయో. ఆ మొహాలు చూడండి ఎంతలా వాడిపోయాయో. వరదొచ్చి మా వాడంతా కొట్టుకుపోయింది. అయిదు రోజుల్నించి అందరికీ పస్తులే. మామీద కనికరించండి. ఇప్పుడీ రొట్టె మీరు లాక్కొనిపోతే మేమంతా ఆకలికి మాడి చచ్చిపోతాం'

'ఏమిటి... చచ్చిపోతారా...? భేషుగ్గా చావండి' బిగ్గరగా నవ్వింది గండుచీమ 'ఇప్పటికే చాలా ఆలస్యమైంది. ఊ... చూస్తారేమిటి... లాక్కుపదండి ఆహారాన్ని' అంటూ తనవాళ్లకి ఆదేశాలిచ్చింది.

నిస్సహాయంగా తలపంకించింది నీలిచీమ. నోటిముందు కొచ్చిన కూడు చిటికెలో తన్నుకుపోతున్న గండుచీమల్ని చూసి కడుపు దహించుకుపోయింది శ్రామిక చీమలకు.

అవి తమకన్నా బలవంతులైతే కావొచ్చు...! పెద్దజాతివైతే కావొచ్చు...! కానీ ఆకలికి జాతుల తేడా లేదు. ఆకలితో అలమటించే తమ కడుపుల మీద కొడుతుంటే చూస్తూ ఊరుకోవాల్సిందేనా...?

ఈ అన్యాయం ఎందుకు జరగనివ్వాలి...?

ఆకలికి ఆగ్రహం తోడై శ్రామిక చీమల చూపులు ఎర్రబడ్డాయి. ఒక సంకల్పంతో చేతులు బిగుసుకున్నాయి.



Scanned by CamScanner

నీలిచీమ ఇది గ్రహించింది. గండు చీమల వైపు చూస్తూ తెగింపుగా 'ఆగండి...! మీరు పెద్దోళ్ళయితే కావచ్చు. కానీ అన్యాయంగా మా కూడు లాక్కుపోతుంటే మేం చూస్తూ ఊరుకోం. మీ కండల్లో బలముంటే మా కడుపుల్లో ఆకలుంది. మా ఆకలిమంట నిప్పులు చిమ్ముతుంది. అ వేడికి మీరంతా కాలి మసైపోతారు. మర్యాదగా ఇక్కణ్నుంచి వెళ్లండి' అంది.

నీలిచీమ హెచ్చరిక గండు చీమల ఆగ్రహాన్ని విపరీతంగా పెంచేసింది. మరోయోచన లేకుండా అవి శ్రామిక చీమల మీద విరుచుకుపడ్డాయి.

మరోక్షణంలో అదో యుద్ధరంగమైంది. కండబలం పుష్కలంగా వున్న గండుచీమలకూ, తెగింపుతో ముందుకురికిన శ్రామిక చీమలకూ మధ్య భీకరపోరాటం జరిగింది. కాస్సేపట్లో అక్కడ శవాల గుట్టలు పోగులుపడ్డాయి. పోరాటంలో వందలకొద్దీ శ్రామిక చీమలు చచ్చిపోయాయి. మిగతావి పారిపోయాయి.

గండుచీమలన్నీ విజయగర్వంతో గంతులేసాయి. 'యుద్ధంలో మనదే విజయం. ఈ ఆహారం ఇక మనదే. పదండి లాక్కెళదాం' అన్నాడు నాయకుడు బిగ్గరగా.

నాయకుని ఆదేశంతో రొట్టె చుట్టూ పడివున్న శ్రామికచీమల మృతదేహాలను తొలగించేశాయి గండుచీమలు.

ఆహారాన్ని తరలించడానికి వ్యూహం తయారైంది. కార్యాచరణకు పూనుకున్నాయన్నీ. గండుచీమల పట్టుకు రొట్టె చిన్నగా కదిలింది.

ఇంతలో...

ఉన్నట్టుండి గాల్లోకి లేచింది రొట్టె. భయంతో కెవ్వున అరిచి చిందర వందరయ్యాయి చీమలన్నీ.

రొట్టెను పాముల్లా చుట్టుకున్న అయిదు వేళ్లు... ఆ వేళ్ళ తాలూకు చెయ్యి మరింత పైకి లేచి చూస్తుండగానే కన్పించకుండా పోయింది.

కదలిపోతున్న ఆ మానవ భూతాన్ని కళ్ళనీళ్ళతో నిస్సహాయంగా చూస్తుండిపోయాయి గండు చీమలు.

*(ఆంధ్రజ్యోతి వారపత్రిక*
*దీపావళి ప్రత్యేక సంచిక, 1990)*



Scanned by CamScanner